
# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు


ప్రపంచ దేశాలకు పోటీగా భారత్ స్వదేశీ 'సర్వం ఏఐ


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 214 పేజీలు : 04 వెల రూ. 2 గురువారం 12 - 02 - 2026


## ప్రశాంతంగా ముగిసిన
# పుర ఎన్నికల పోలింగ్

- పలుచోట్ల స్వల్ప ఘర్షణలు
- రాష్ట్రవ్యాప్తంగా 116 పుర, 7 కార్పొరేషన్లలో ముగిసిన పోలింగ్
- ఉదయం మందకొడిగా సాగినా మధ్యాహ్నం తరువాత ఊపందుకున్న పోలింగ్
- సాయంత్రం 5 గంటల లోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు
- 60 శాతానికి మించి పోలింగ్ నమోదైనట్లు అధికారులు అంచనా
- ఫిబ్రవరి 13వ తేదీన ఓట్ల లెక్కింపు అనంతరం అభ్యర్థుల భవితవ్యం
- పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,031 బ్యాలెట్ బాక్సులను ఎస్ఈసీ ఏర్పాటు
- రాష్ట్రంలోని 8,191 పోలింగ్ కేంద్రాల నుంచి ఓటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో పుర, నగరపాలక ఎన్నికల్లో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లలోని 2,981 వార్డుల్లో పోలింగ్ నిర్వహించగా అక్కడక్కడ చెదురు మదురు ఘటనలు మినహా ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. సాయంత్రం 5 గంటల లోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. నాయకులు, యువత, వృద్ధులు, మహిళలు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 60 శాతానికి మించి పోలింగ్ నమోదైనట్లు అధికారులు అంచనావేస్తున్నారు. ఫిబ్రవరి 13వ తేదీన ఓట్ల లెక్కింపు అనంతరం అభ్యర్థుల భవితవ్యం - మిగతా 2 లో

## కొడంగల్ లో ఓటేసిన సీఎం
## మధిరలో డిప్యూటీ సీఎం



- మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రముఖులు
- మంచిర్యాలలో మంత్రి వివేక్ వెంకటస్వామి
- కేంద్రమంత్రి బండి సంజయ్, కామారెడ్డిలో షబ్బీర్ అలీ..
- సాయంత్రం 5 గంటలకు ముగియనున్న పోలింగ్

హైదరాబాద్ : తెలంగాణలోని 116 మున్సిపాలిటీలలో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కొనసాగుతోంది. పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. - మిగతా 2 లో

## మూడు కార్పొరేషన్లుగా
## హైదరాబాద్ విభజన




- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- సైబరాబాద్, మల్కాజ్‌గిరి పేర్లతో రెండు కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు
- మూడు సంస్థలకు వేర్వేరుగా కమిషనర్ల నియామకం
- పాలన వికేంద్రీకరణ, పౌర సేవలు మెరుగుపరచడమే లక్ష్యం
- మొత్తం 300 వార్డులు, 60 సర్కిళ్లతో నగర పాలన పునర్వ్యవస్థీకరణ


హైదరాబాద్ : హైదరాబాద్ మహానగర పాలనలో తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. పాలనా సౌలభ్యం, అధికార వికేంద్రీకరణ లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను మూడు కార్పొరేషన్లుగా విభజించింది. ఈ మేరకు బుధవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పునర్వ్యవస్థీకరించిన జీహెచ్ఎంసీతో పాటు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (వీవీజ) పేరుతో రెండు కొత్త సంస్థలను ఏర్పాటు చేసింది. - మిగతా 2 లో

## సభలో అంతకుమించి లేరుగా!




- వైసీపీ సభ్యులపై స్పీకర్ అయ్యన్న సరదా వ్యాఖ్య
- గవర్నర్ ప్రసంగానికి పదేపదే ఆటంకం కలిగించిన వైసీపీ ఎమ్మెల్యేలు
- ప్రసంగం కొనసాగుతుండగానే జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేల వాకౌట్
- 11వ తేదీన 11 నిమిషాలకు మించి వారు సభలో లేరన్న అయ్యన్నపాత్రుడు

## జనగణమన కంటే ముందు
# 'వందేమాతరం' తప్పనిసరి




- 'వందేమాతరం'పై కేంద్రం కీలక నిర్ణయం
- కొత్త నిబంధనలు విడుదల చేసిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ
- ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో వందేమాతరం తప్పనిసరి
- అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరిక
- 1937లో తొలగించిన నాలుగు చరణాలతో కలిపి మొత్తం ఆరు చరణాలను పాడాలని కేంద్రం వెల్లడించింది
- స్వాతంత్ర పోరాట సమయంలో ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు నాలుగు చరణాలను తొలగింపు

ఢిల్లీ : 'వందేమాతరం' గీతాన్ని అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, అన్ని పాఠశాలల్లో తప్పనిసరి చేస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ బుధవారం కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. 'జనగణమన' వంటి జాతీయ గీతాల కంటే ముందు దీనిని కచ్చితంగా ఆలపించాలని ఈ నిబంధనలలో పేర్కొంది. వందేమాతర గీతం ఆలపించినప్పుడు అందరూ నిలబడాలని పేర్కొంది.అన్ని - మిగతా 2 లో

## శ్రీశైలం నడకదారిలో
# పెద్దపులి కలకలం

- ఊపిరిబిగపట్టిన భక్తులు!
- శ్రీశైలం పాదయాత్ర భక్తులకు తారసపడ్డ పెద్దపులి
- నల్లమల అడవిలోని పెద్దచెరువు వద్ద ఘటన
- భక్తులు భయంతో కదలకుండా నిలబడటంతో తప్పిన ముప్పు
- మల్లన్న దయవల్లే ప్రమాదం జరగలేదంటున్న భక్తులు




### థాయ్‌లాండ్‌లో స్కూల్లోకి జొరబడి
## విద్యార్థులు, టీచర్లపై కాల్పులు

- సోంఖ్లా ప్రావిన్స్‌లో ఘటన.. ఒకరి మృతి
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 18 సంవత్సరాల వ్యక్తి కాల్పులకు తెగబడ్డాడని వెల్లడి






## మరో 15 ఏళ్లు మనం
## ఇలాగే బలంగా నిలబడాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఐక్యంగా ఉంటేనే గుజరాత్ తరహాలో అభివృద్ధి సాధ్యమని స్పష్టం
- ప్రభుత్వ విజయాలను ఎమ్మెల్యేలు ఓన్ చేసుకోవాలని, సభకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశం
- కేంద్రం సహకారంతోనే పోలవరం, అమరావతి, స్టీల్ ప్లాంట్ వంటివి గాడిన పడ్డాయని వెల్లడి
- విభేదాలుంటే అంతర్గతంగా చర్చిద్దామని పవన్ పిలుపు

అమరావతి : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి మరో 15 ఏళ్ల పాటు ఐక్యంగా, బలంగా కొనసాగాలని, అప్పుడే గుజరాత్ తరహాలో సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఏ స్ఫూర్తితో నిలబడ్డామో, అదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఎన్డీఏ శాసనసభా - మిగతా 2 లో


## 20 నెలల పాలన..
# 60 విజయాలు..

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రజలకు వివరించండి
- కూటమి నేతలకు జాబితా ఇచ్చిన సీఎం చంద్రబాబు
- ఎన్డీఏ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం చంద్రబాబు సమావేశం
- 20 నెలల పాలనలో సాధించిన విజయాలను వివరించిన సీఎం
- విధ్వంసం నుంచి వికాసం వైపు పురోగతి సాధించామన్న చంద్రబాబు
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు పిలుపు
- 60 ప్రధాన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల జాబితా విడుదల
- అతి తక్కువ కాలంలోనే ప్రజలు మెచ్చే పాలన అందించామని చంద్రబాబు అన్నారు



అమరావతి : ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలిరోజున అసెంబ్లీ కమిటీ హాలులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. గడిచిన 20 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలను, చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు పురోగమిస్తోందని, ప్రతి రంగంలోనూ వృద్ధి నమోదైందని తెలిపారు. ప్రజావసరాలను గుర్తించి నిర్ణయాలు తీసుకుంటూ అతి తక్కువ కాలంలోనే ప్రజలు మెచ్చే పాలన అందించామని చంద్రబాబు అన్నారు. ప్రతి ఎమ్మెల్యే, మంత్రి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా, 20 నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన 60 ప్రధాన కార్యక్రమాలు, సాధించిన విజయాల జాబితాను సీఎం - మిగతా 2 లో

## ప్రజానాడి



# సంపాదకీయం

## బంగ్లాకు పరీక్షా సమయం

ఏణ్ణర్థంక్రితం విద్యార్థి ఉద్యమం ధాటికి మాజీ ప్రధాని షేక్ హసీనా అధికారాన్నీ, దేశాన్నీ వదిలిపెట్టిన నాటినుంచీ రాజకీయ, సామాజిక అస్థిరతలో కూరుకుపోయిన బంగ్లాదేశ్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయి. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, ఆర్థిక నిపుణుడు అయిన మహ్మద్ యూనస్ ప్రధాన సలహాదారుగా ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం ఉన్న వైషమ్యాలను మరింత పెంచి పోషించింది. జవాబుదారీతనం లేని అధికారంతో ఆయన తీసుకుంటున్న వరస నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమై, తక్షణం ఎన్నికలు నిర్వహించాలని ఒత్తిళ్లు పెరగటంతో ఇవి తప్పనిసరి అయ్యాయి. మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ఆధ్వర్యంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) గెలుపుగుర్రంగా కనబడటమే గత ఎన్నికలకూ, ప్రస్తుత ఎన్నికలకూ కొట్టొచ్చి నట్టు కనబడుతున్న తేడా. పదిహేనేళ్లపాటు దేశాన్నేలిన షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్‌పై నిషేధం విధించటంతో ఆ పార్టీ జాడలేదు. పాకిస్తాన్ నుంచి విడివడి 1971లో స్వతంత్ర ప్రయాణం ప్రారంభించిననాటి నుంచీ బంగ్లాదేశ్‌కు ఆటుపోట్లు తప్పడం లేదు. సైనిక కుట్రలు, మత ఛాందసవాదం షరా మామూలైన పాకిస్తాన్ చీడ దానికి కూడా అంటి, ఆటుపోట్లు ఎదుర్కొంటూనే ఉంది. 17 కోట్ల 30 లక్షల జనాభాతో ప్రపంచంలోనే ఎనిమిదో స్థానంలో ఉన్న బంగ్లా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నదని ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సంస్థలు ప్రశంసిస్తూ ఉండేవి. అదే జరిగుంటే హసీనా పదవికి ముప్పు వచ్చి ఉండేది కాదు. కానీ ఆర్థిక అసమానతలకు తోడు పేదరికం, అవినీతి, కక్షసాధింపు ఆమెను దెబ్బతీశాయి. 2022 నుంచి బంగ్లా ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌ల నుంచి వందలకోట్ల డాలర్ల రుణాలు తీసు కొస్తున్నా మారిందేమీ లేదు. ఆ డబ్బంతా పాలకపార్టీని ఆశ్రయించుకున్నవారి జేబుల్లోకి పోయింది. అధిక ధరలు, ఉపాధిలేమి సగటు మధ్యతరగతి, దిగువతరగతి కుటుంబా లను తీవ్రంగా దెబ్బతీశాయి. బీఎన్‌పీయే విజేతగా నిలుస్తుందని సర్వేలు చెబుతున్నా ఆ పార్టీకి అంత మంచి పేరేమీ లేదు. తూర్పు పాకిస్తాన్‌గా ఉన్నకాలంలో అప్పటి పాక్ పాలకులు తీవ్ర అణచివేత చర్యలకు పాల్పడినా, అనంతరకాలంలో అధికారంలోకొచ్చిన బీఎన్‌పీ ఆ దేశంతో అంట కాగిందనీ, అవినీతిలో కూరుకుపోయిందనీ జనం గుర్తు చేసుకుంటున్నారు. అందుకే రెహ్మాన్ కొత్త బాణీ అందుకుని అన్ని సభల్లోనూ గత తప్పులకు క్షమాపణ కోరుతున్నారు. 1971 విముక్తి పోరాటంలోనూ, 2024 ప్రజాస్వామ్య ఉద్యమంలోనూ మరణించిన వారికి నివాళు లర్పిస్తున్నారు. బీఎన్‌పీ మాదిరే పాకిస్తాన్ అనుకూల పార్టీగా పేరున్న జమాతే ఇస్లామీ(జేఈఐ)కు ఉన్న అనుకూలాంశమల్లా ఆ పార్టీ ఎప్పుడూ అధికారంలో లేకపోవ టమే! మహిళల హక్కుల విషయంలో ఆ పార్టీది ఛాందసవాద ధోరణి. దీన్ని బీఎన్‌పీ తనకు అనుకూలంగా మలుచుకుని, తమ పాలనలో లింగవివక్ష ఉండబోదంటోంది. అయితే యూనస్ ప్రభుత్వం ఏర్పడ్డాక హిందువులపై పెరిగిన దాడుల్ని తామే దృఢంగా ఎదిరించి, రక్షణగా నిలిచామని జేఈఐ చెప్పుకుంటోంది. కానీ ఆ దాడులు ఆగింది లేదు. ఎన్నికల ప్రకటన వెలువడ్డాక అవి మరింత ఎక్కువయ్యాయి. మంగళవారం హిందూ వ్యాపారి సుసేన్ చంద్ర సర్కార్‌ను ఆయన దుకాణంలోనే దుండగులు కాల్చిచంపారు. బంగ్లాలో ఎవరు పాలకులైనా చైనా, పాకిస్తాన్‌ల ప్రభావం దండిగానే ఉంటుంది. బీఎన్‌పీ ఈ విషయంలో బహిరంగంగా ఏమీ చెప్పకపోయినా, జేఈఐ తన పాక్ అనుకూలతను చాటుకోవటంతో పాటు ఇటీవల చైనా దౌత్యవేత్తలతో భేటీ అయింది. విషాదమేమంటే, హసీనాను పదవీచ్యుతురాలిని చేయటంలో కీలకపాత్ర పోషించిన జెన్ జీ తరానికి ఈ ఎన్నికల్లో పెద్దగా ప్రాధాన్యం లేదు. విద్యార్థుల నాయకత్వంలోని నేషనల్ సిటిజెన్ పార్టీకి ఆశించినంత మద్దతు లభిస్తున్న దాఖలా లేదు. నిరుడు తాత్కాలిక ప్రభుత్వ ప్రతినిధులతో పాటు 30 రాజకీయ పార్టీలు పాల్గొన సదస్సు ఆమోదించిన 'జూలై ఛార్టర్'పై కూడా గురువారం రిఫరెండమ్ జరగబోతోంది. ప్రస్తుత రాజ్యాంగాన్ని మార్చేందుకే, చరిత్ర వక్రీకరించేందుకే దీన్ని తీసుకొచ్చారని వామపక్షాల విమర్శ. మొత్తానికి బంగ్లాదేశ్ భవితవ్యం ఎలా ఉండబోతున్నదో ఈ ఎన్నికలూ, రిఫరెండమ్ తేల్చబోతున్నాయి.

# 20 నెలల పాలన.. 60 విజయాలు..

**మొదటిపేజీ తరువాయి** – వివరించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:

1. తల్లికి వందనం: రూ.10,090 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ. 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం.
2. స్త్రీ శక్తి: 43.51 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు. రూ.1,532 కోట్లు ఖర్చు.
3. దీపం 2 పథకం: 1.08 కోట్ల కుటుంబాలకు ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్ల పంపిణీ. ఇప్పటికి 3.64 కోట్ల సిలిండర్లు అందజేత, రూ.2,891 కోట్లు వ్యయం.
4. అన్నదాత సుఖీభవ: 46.86 లక్షల మంది రైతులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున సాయం. రెండు విడతల్లో రూ.6,310 కోట్లు జమ.
5. ఎన్టీఆర్ భరోసా: నెలకు 63 లక్షల మందికి పింఛన్లు. ఇప్పటికి రూ.58,654 కోట్లు వ్యయం.
6. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఎక్కడైనా పింఛను తీసుకునే అవకాశం.
7. మత్స్యకార భరోసా: ఏడాదికి రూ.20 వేల చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు.
8. నేతన్నలకు ఉచిత విద్యుత్: మరమగ్గాలకు 500, మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్. లక్షకు పైగా కుటుంబాలకు లబ్ధి.
9. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15,000 సాయం. రూ.436 కోట్లు జమ, 2.90 లక్షల మందికి లబ్ధి.
10. అన్న క్యాంటీన్లు: 113 నియోజకవర్గాల్లో 205 క్యాంటీన్ల ద్వారా 7.50 కోట్ల భోజనాలు.
11. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయింపు, స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్.
12. వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ, అన్ని వర్గాలకు సమన్యాయం.
13. 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం.
14. ఇమామ్‌లకు నెలకు రూ.10,000, మౌజన్లకు రూ.5,000 గౌరవ వేతనం.
15. అర్చకులకు వేతనం రూ.15,000కు పెంపు. నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25,000, జూనియర్ లాయర్లకు రూ.10,000 గౌరవ వేతనం.
16. మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టుల భర్తీకి తొలి సంతకం.
17. 5,757 కానిస్టేబుల్ పోస్టుల నియామకం పూర్తి. స్టైఫండ్ రూ.12,500కు పెంపు.
18. రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు.
19. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు. బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్లు.
20. ప్రతీ నెలా 3వ శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'. చెత్తపన్ను రద్దు.
21. రూ.1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు, రూ.3,000 కోట్లతో నూతన రహదారులు.
22. కొత్తగా 25 పారిశ్రామిక పాలసీలు, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు.
23. విశాఖ సీఐఐ సమ్మిట్‌లో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16.13 లక్షల ఉద్యోగాలకు ఒప్పందాలు.
24. 14 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం, 8.36 లక్షల ఉద్యోగాలు.
25. విశాఖలో రూ.1.25 లక్షల కోట్లతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు.
26. అమరావతిలో క్వాంటం వ్యాలీ భవనాలకు శంకుస్థాపన. విశాఖలో టీసీఎస్ ప్రారంభం.
27. కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన.
28. తిరుమల సహా ప్రధాన ఆలయాల్లో నిత్యాన్నదానాలు.
29. విశాఖలో యోగాంధ్ర, కర్నూలులో సూపర్ జీఎస్టీ సభ విజయవంతం.
30. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు, పేదలకు అదనంగా 110 వైద్య విద్య సీట్లు.
31. గ్రామ సభల ద్వారా 3 వేల పనులకు శ్రీకారం, పంచాయతీలకు నిధుల విడుదల, అమరజీవి జలధార పథకం.
32. విద్యా వ్యవస్థలో మార్పులు, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం.
33. గేట్స్ ఫౌండేషన్, టాటాలతో సంజీవని ప్రాజెక్టు, యూనివర్సల్ హెల్త్ పాలసీ ప్రతిపాదన.
34. విద్యుత్ చార్జీల పెంపు లేదని ప్రకటన, ట్రూ అప్ భారాన్ని భరిస్తున్న ప్రభుత్వం.
35. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి డబుల్ డిజిట్ గ్రోత్ 11.28 శాతానికి చేరిక.
36. పేదలకు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తుల స్వీకరణ, 3 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు.
37. ఉచిత ఇసుక పథకం అమలు, నాలా యాక్ట్ రద్దు.
38. 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్.
39. తగ్గిన క్రైమ్ రేట్, గంజాయి-డ్రగ్స్ అరికట్టేందుకు ఈగల్ టాస్క్ ఫోర్స్.
40. మన మిత్ర ద్వారా వాట్సప్ గవర్నెన్స్‌తో 921 సేవలు.
41. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రంగా 3 రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణ.
42. పూర్వోదయ పథకంలో రాష్ట్రానికి చోటు, రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఆస్కారం.
43. విశాఖ రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం పనుల ప్రారంభం.
44. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల కేంద్ర సాయం.
45. 90 కేంద్ర పథకాల పునరుద్ధరణ, నిధుల సద్వినియోగం.
46. రాష్ట్రానికి రూ.1 లక్ష కోట్ల విలువైన నేషనల్ హైవే, రైల్వే ప్రాజెక్టులు.
47. కొత్తగా రెండు జిల్లాల ఏర్పాటుతో మొత్తం 28 జిల్లాలు.
48. మహిళలకు లక్ష కుట్టు మిషన్ల పంపిణీ.
49. రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ, 24 గంటల్లో రైతులకు రూ.8,120 కోట్లు జమ.
50. మార్కెట్ ఇంటర్వెన్షన్‌తో వివిధ పంటలకు రూ.1,100 కోట్లకు పైగా సాయం.
51. సమర్థ నీటి నిర్వహణతో 6.08 మీటర్లకు పెరిగిన భూగర్భ జలాలు.
52. సాగునీటి ప్రాజెక్టులకు 20 నెలల్లో రూ.23,793 కోట్ల ఖర్చు.
53. హంద్రీనీవా పనులు పూర్తి చేసి సీమకు 43 టీఎంసీల తరలింపు.
54. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.571 కోట్లు వ్యయం.
55. శరవేగంగా పోలవరం నిర్మాణం, 2027 పుష్కరాలకు ప్రారంభం.
56. తుంగభద్ర గేట్ల మరమ్మతులకు ఏపీ వాటాగా రూ.55 కోట్లు.
57. రూ.610 కోట్లతో వివిధ ప్రాజెక్టుల మరమ్మతులు, రూ.878 కోట్లతో కాలువల నిర్వహణ.
58. 6,047 సాగునీటి సంఘాలకు ఎన్నికలు.
59. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రం మీదుగా 3 హై స్పీడ్ రైల్ కారిడార్లు.
60. ఆర్థిక కష్టాలు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులకు సంక్షేమ ఫలాలు.

# సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం

**మొదటిపేజీ తరువాయి** – సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరుగుతున్న మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. నీటిపారుదలశాఖలోని 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం తెలిపారు. భూములు బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు క్యాబినెట్‌లో ఆమోదం లభించింది. గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో 1000 చ.గజాల వరకూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును మరో 6 నెలలు పొడిగిస్తూ అనుమతించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములలో నివాసాలు ఏర్పరుచుకున్న అనధికార ఆక్రమణల క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును 30-06-2026 వరకూ అనుమతికి క్యాబినెట్ ఆమోదించింది.కృష్ణా జిల్లా గన్నవరం మండలం కీసరపల్లి గ్రామంలోని సర్వే నెం.29/8లోని 3.84 ఎకరాల భూమిని "కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ కార్యాలయం, నివాస గృహాల నిర్మాణం" కోసం ఉపయోగించేందుకు అనుగుణంగా గతంలో ఇచ్చిన జీవోలో మార్పు చేస్తూ కేబినేట్ నిర్ణయం తీసుకుంది. ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో 45.60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్ఆర్ఈడీసీఏపీ(ఛీ=జుణజాూ)కి కాంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపన కోసం కేటాయించే ప్రతిపాదనకు ఆమోదించనుంది. నంద్యాల జిల్లా సంజామల మండలం నోస్సం గ్రామంలో 1500 ఎకరాలు భూమిని 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ కోసం ఎన్ఆర్ఈడీసీఏపీకి కేటాయించేందుకు క్యాబినెట్ ఆమోదించనుంది. ఏపీ ఏఐ లివింగ్ ల్యాబ్స్‌కి ఆమోదం: విశాఖపట్నం ఆనందపురం మండలం గుడిలోవ గ్రామంలో 18.57 ఎకరాలు ప్రభుత్వ భూమి కేటాయింపుపై మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ప్రారంభానికి, తిరుపతిలో ఏపీఎస్డీసీ కోసం డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలపనుంది. డీఎస్డబ్ల్యూఎస్ బిల్లు 2026ను శాసనసభలో ప్రవేశపెట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. అమరావతి మెరినా అభివృద్ధికి 33 సంవత్సరాల లీజు ప్రాతిపదికన, టెండర్లకు ఆహ్వానించింది. పీఎంఏవై గ్రామీణ్ 2.0లో యూనిట్ ఖర్చు రూ.2 లక్షల 39 వేలుగా నిర్ణయించి క్యాబినెట్ అంగీకారం తెలపనుంది.రామాయపట్నం పోర్ట్ అభివృద్ధి కార్పొరేషన్ రుణ పునర్వినియోగం, రాష్ట్ర హామీ, కంఫర్ట్ లెటర్ జారీ తదితర అంశాలపై మంత్రివర్గం చర్చించింది. ఎన్నికల ఓటర్ల జాబితా ప్రచురణకు ఏడాదికి 4 అర్హత తేదీలను కల్పించేం దుకు సవరణ బిల్లుకు కేబినేట్ ఆమోదించింది. యాగంటి పీఎస్పీ , రాజుపాలెం పీఎస్పీ ప్రాజెక్టు లను ఏపీ జెన్కో స్వతంత్రంగా అమలు చేయడానికి ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఏపి ట్రాన్స్‌కోలో కడప జోన్ పరిపాలన కోసం అసిస్టెంట్ సెక్రటరీ పోస్టు సృష్టి ప్రతిపాదనకు ఆమోదం తెలపనుంది. సుజ్లాన్ & యాక్సిస్ సంస్థల అభ్యర్థన మేరకు పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల అమలు గడువును మరో 2 సంవత్సరాలు పొడిగిస్తూ మంత్రివర్గం నిర్ణయించింది.

# మరో 15 ఏళ్లు మనం ఇలాగే బలంగా నిలబడాలి

**మొదటిపేజీ తరువాయి** – పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. గడిచిన 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు రాకపోవడం శుభపరిణామమని, ఇదే ఐక్యతతో పనిచేసి ఎమ్మెల్యేలు ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.ఎన్నికల నాటి కంటే ఇప్పుడు కూటమిపై ప్రజా మద్దతు మరింత పెరిగిందని చంద్రబాబు అన్నారు. "గుజరాత్‌లో బీజేపీ వరుసగా ఐదుసార్లు గెలిచి అధికారంలో ఉంది. ఒకే ప్రభుత్వం సుదీర్ఘకాలం కొనసాగడం వల్లే అక్కడ అభివృద్ధి సాధ్యమైంది. మన రాష్ట్రంలోనూ అదే జరగాలి. మరో 15 ఏళ్ల పాటు మూడు పార్టీలు ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి రావాలి. అప్పుడే శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడగలం" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

**ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు**

ఈ సందర్భంగా శాసనసభ్యులకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. "అసెంబ్లీ సమావేశాలను ప్రతి సభ్యుడు సీరియస్‌గా తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందరూ సభలోనే ఉండాలి. నేను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతాను. సభలో సబ్జెక్టులపై అర్థవంతమైన చర్చలు జరగాలి. ఎదుటివారు తిట్టారని మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజామోదయోగ్యంగా సభను నడుపుదాం" అని అన్నారు. త్వరలోనే జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, ఎస్పీలతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి, నియోజకవర్గాల్లో పెండింగ్ పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్లే రాష్ట్రం వేగంగా కోలుకుంటోందని చంద్రబాబు వివరించారు. "వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టామంటే దానికి కేంద్రం చేయూతే కారణం. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం నిధులు ఇవ్వకపోయి ఉంటే అవి ముందుకు కదిలేవి కావు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తున్నామంటే అది కేంద్రం సాయంతోనే. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టేందుకు కేంద్రం తన పాలసీనే మార్చుకుంది. ఫలితంగా, మొదటిసారిగా స్టీల్ ప్లాంట్ ఒక్క నెలలో రూ.54 కోట్ల లాభాలు సాధించింది. సూపర్ సిక్స్‌తో సహా అన్ని పథకాలు అమలు చేస్తున్నామంటే దాని వెనుక కేంద్రం అండ ఉంది. ఈ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి ఎమ్మెల్యే ఓన్ చేసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూటమి నేతలు ఎదుర్కొన్న అణచివేతను చంద్రబాబు గుర్తుచేశారు. పవన్ కల్యాణ్‌ను విశాఖలో హోటల్ గదికే పరిమితం చేయడం, తన అరెస్టు సమయంలో ఆయనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం వంటి ఘటనలను ప్రస్తావించారు. అలాంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఐక్యంగా నిలబడి గెలిచామని, ఈ స్ఫూర్తిని ఎప్పటికీ మరువకూడదని హితవు పలికారు.

**కూటమి ధర్మానికి కట్టుబడి ఉందాం: పవన్ కల్యాణ్**

ముఖ్యమంత్రి అభిప్రాయంతో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పూర్తిగా ఏకీభవించారు. గత 20 నెలలుగా ఐక్యంగా పనిచేసి, వైసీపీ ఐదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి ప్రగతి బాట పట్టిస్తున్నామని అన్నారు. "రాష్ట్రాభివృద్ధి కోసం మరో 15 ఏళ్లు కూటమి కలిసి ఉంటుంది. ఐక్యంగా ముందుకు వెళ్తుంది. ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తి భవిష్యత్తులోనూ అవసరం. పార్టీల మధ్య ఏవైనా భిన్నాభిప్రాయాలు ఉంటే, వాటిని అంతర్గతంగా కూర్చుని పరిష్కరించుకోవాలి. ప్రతి ఒక్కరూ కూటమి ధర్మానికి కట్టుబడి పనిచేయాలి" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# సభలో అంతకుమించి లేరుగా!

**మొదటిపేజీ తరువాయి** – ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ లాబీలో శాసన సభ సభాపతి అయ్యన్నపాత్రుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా వైసీపీ సభ్యులు సభకు హాజరయ్యారు. కానీ ఆయన ప్రసంగం కొనసాగుతుండగా నిరసన తెలిపి వెళ్లిపోయారు. దీనిపై స్పీకర్ సరదాగా స్పందించారు.11వ తేదీన 11 మంది సభ్యులు 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారని అన్నారు. సభ్యులు గవర్నర్ ప్రసంగం సమయంలో అంతకుమించి లేరుగా అని అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. సభ్యులు సభా సంప్రదాయాలు పాటించాలని హితవు పలికారు.కాగా, ఈరోజు అసెంబ్లీ సమావేశాలకు వైఎస్ జగన్ సహా వైసీపీ సభ్యులు హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగానికి పదేపదే ఆటంకం కలిగిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మెడికల్ కాలేజీల్లో పీపీపీ పద్ధతిని రద్దు చేయాలని, రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాలని, వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని నినాదాలు చేశారు. ఆ తర్వాత కొన్ని నిమిషాలకే వైసీపీ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు.

## జనగణమన కంటే ముందు 'వందేమాతరం' తప్పనిసరి

**మొదటిపేజీ తరువాయి** – పురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపిం చాలని ఈ నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా అంతరాయం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. తాజాగా విడుదల చేసిన నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ళ జైలు శిక్ష విధించనున్నట్లు స్పష్టం చేసింది. సినిమా హాల్స్ వంటి ప్రదేశాల్లో కూడా దీనిని తప్పనిసరి చేసింది. ఈ సందర్భాల్లో నిలబడటాన్ని తప్పనిసరి చేయలేదు.కేంద్ర ప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ కొత్త నిబంధనల ను విడుదల చేసింది. 1937లో తొలగించిన నాలుగు చరణాలతో కలిపి మొత్తం ఆరు చరణాలను పాడాలని కేంద్రం వెల్లడించింది. స్వాతంత్ర పోరాట సమయంలో ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు నాలుగు చరణాలను తొలగించిన కాంగ్రెస్, రెండు చరణాలను స్వీకరించింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం రెండు చరణాలతోనే 'వందేమాతరం'ను జాతీయ గేయంగా ప్రకటించింది.

# శ్రీశైలం నడకదారిలో పెద్దపులి కలకలం

**మొదటిపేజీ తరువాయి** – శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులకు భయంకరమైన అనుభవం ఎదురైంది. నల్లమల అటవీ మార్గంలో వారికి ఏకంగా ఓ పెద్దపులి ఎదురుపడింది. మార్కాపురం జిల్లా డోర్నాల మండలం పరిధిలోని పెద్దచెరువు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.వివరాల్లోకి వెళితే, శివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలానికి కాలినడకన వెళుతున్న భక్తుల బృందానికి దారి పక్కన పొదల్లో పెద్దపులి కనిపించింది. కొద్దిసేపు భక్తులను తీక్షణంగా చూస్తూ అక్కడే నిలబడింది. అటవీశాఖ అధికారుల హెచ్చరికలతో అప్రమత్తంగా ఉన్న భక్తులు, భయంతో పరుగులు తీయకుండా నిల్చుండిపోయారు. ఇరువైపులా నిశ్శబ్దం నెలకొనగా, క్షణక్షణం ఉత్కంఠగా గడిచింది.కొంతసేపటికి ఆ పులి నెమ్మదిగా అడవిలోకి వెళ్లిపోవడంతో భక్తులంతా ఊపిరి పీల్చుకున్నారు. 'శ్రీశైలం మల్లన్నే కాపాడాడు', 'ఓం నమశ్శివాయ' అంటూ భక్తితో నినాదాలు చేస్తూ తమ యాత్రను కొనసాగించారు. ఈ ఘటనను ఓ వాహనదారుడు తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశారు. అన్నదాన శిబిరానికి సరుకులు తీసుకెళుతున్న ఆయన, ఈ వీడియోను ఇతర యాత్రికులకు చూపించి వారిని అప్రమత్తం చేశారు.నల్లమల అడవి గుండా వెళ్లే యాత్రికులు గుంపులుగా వెళ్లాలని, ఒంటరిగా ప్రయాణించవద్దని అటవీ అధికారులు సూచిస్తున్నారు. ఈ ప్రాంతంలో పులుల సంచారం సాధారణమే అయినప్పటికీ, ఇలా యాత్రికులకు ముఖాముఖి ఎదురుపడటం ఆందోళన కలిగిస్తోంది. అయితే, మల్లికార్జున స్వామి దయవల్లే తమకు ఎలాంటి హాని జరగలేదని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు.

## థాయ్‌లాండ్‌లో స్కూల్లోకి జొరబడి విద్యార్థులు, టీచర్లపై కాల్పులు

**మొదటిపేజీ తరువాయి** – థాయ్‌లాండ్‌లో ఒక దుండగుడు స్కూల్‌లోకి జొరబడి విద్యార్థులు, ఉపాధ్యాయులపై తుపాకీతో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, థాయ్‌లాండ్‌లోని సోంఘ్‌క్లా ప్రావిన్స్‌లో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పాఠశాలలో దుండగుడు బంధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను పోలీసులు రక్షించారు. నిందితుడు 18 సంవత్సరాల కుర్రాడు అని, అతడు పలుమార్లు తన తుపాకీతో కాల్పులకు తెగబడ్డాడని ఒక పోలీసు అధికారి వెల్లడించారు. నిందితుడు తుపాకీతో ఫటోంగ్ ప్రథాన్ ఖిరివాట్ పాఠశాలలోకి ప్రవేశించి కాల్పులు జరిపాడని తెలిపారు. కాగా, 2022లో ఒక మాజీ పోలీసు అధికారి తుపాకీ, కత్తితో దాడి చేయడం వల్ల ఒక నర్సరీ స్కూల్లో 22 మంది పిల్లలు సహా 36 మంది చనిపోయారు.

## కొడంగల్ లో ఓటేసిన సీఎం మధిరలో డిప్యూటీ సీఎం

**మొదటిపేజీ తరువాయి** – కాసేపట్లో ఆయన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుని ఢిల్లీకి వెళతారని సమాచారం.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కరీంనగర్ జ్యోతి నగర్‌లోని ఎస్సార్ హై స్కూల్ కేంద్రంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది.

# ప్రశాంతంగా ముగిసిన పుర ఎన్నికల పోలింగ్

**మొదటిపేజీ తరువాయి** – తేలనుంది.ప్రశాంతంగా ముగిసిన పోలింగ్ : మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు నిర్వహించిన ఎన్నికలు చెదురుమదురు ఘటనల మధ్య ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,031 బ్యాలెట్ బాక్సులను ఎస్ఈసీ ఏర్పాటు చేసింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత పుంజుకుంది. పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ నిర్ణయాన్ని బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీలు 2,582 వార్డుల్లో కౌన్సిలర్ల ఎన్నిక కోసం ఓటింగ్ నిర్వహించారు. ఇప్పటికే తొమ్మిది పురపాలికల్లోని 12 వార్డుల్లో పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మక్తల్ మున్సిపాల్టీలోని ఆరో వార్డులో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప బలవన్మరణానికి పాల్పడటంతో అక్కడ ఎన్నిక నిర్వహించలేదు. అన్ని మున్సిపాల్టీల్లో కలిపి 10,719 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పుర ఎన్నికలకు సంబంధించి 6,017 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.రాష్ట్రంలోని 8,191 పోలింగ్ కేంద్రాల నుంచి ఓటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పోలింగ్ పూర్తి కావడంతో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు 137 స్ట్రాంగ్ రూంలు సిద్ధం చేశారు. ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే గురువారం నిర్వహించనున్నట్లుగా తెలిసింది. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 136 కేంద్రాల్లో ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. ఈనెల 16వ తేదీన మున్సిపాల్టీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది. పురపాలక ఎన్నికల సందర్భంగా పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో చెదురుమదురు ఘటనల మినహా పురపాలిక పోలింగ్ సజావుగా సాగింది. సంగారెడ్డిలో 34 వార్డు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి చొక్కాను సీఐ పట్టుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నారు. పోలింగ్ ఆపేస్తామని బూత్‌లోకి దూసుకెళ్లడంతో ఉద్రిక్తత నెలకొంది.ఈ క్రమంలో పోలీసులు-జగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్‌కి సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. నర్సాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డులో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ క్రమంలోనే పరస్పర దాడులకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. రామాయంపేట ఏడో వార్డులో బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది.

## మూడు కార్పొరేషన్లుగా హైదరాబాద్ విభజన

**మొదటిపేజీ తరువాయి** – ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.నగర జనాభా, విస్తీర్ణం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, జవాబుదారీతనాన్ని పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జీహెచ్ఎంసీ చట్టం, 1955లోని సెక్షన్ 3(1) ప్రకారం ఈ విభజన ప్రక్రియను పూర్తి చేశారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఉత్తర్వులపై సంతకం చేశారు.ప్రభుత్వం మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమించింది. ప్రస్తుత జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న ఆర్.వి. కర్ణన్‌ను అదే పదవిలో కొనసాగించింది. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్లుగా పనిచేస్తున్న జి. సృజనను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, టి. వినయ్ కృష్ణారెడ్డిని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించింది. ఈ మూడు కార్పొరేషన్ల మధ్య సమన్వయం కోసం జయేష్ రంజన్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ మరో ఉత్తర్వు జారీ చేసింది.

కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్ల పరిధిని జోన్ల వారీగా స్పష్టంగా నిర్వచించారు.

జీహెచ్ఎంసీ: శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు.

సైబరాబాద్ కార్పొరేషన్: శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు.

మల్కాజ్‌గిరి కార్పొరేషన్: మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్.బి. నగర్ జోన్లు.గత ఏడాది డిసెంబర్‌లో 27 చుట్టుపక్కల పట్టణ స్థానిక సంస్థలను (ఖూదీ) జీహెచ్ఎంసీలో విలీనం చేయడంతో దాని పరిధి సుమారు 2,000 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. ఈ నేపథ్యంలో వార్డుల సంఖ్యను 150 నుంచి 300కు, సర్కిళ్ల సంఖ్యను 30 నుంచి 60కి పెంచుతూ డిలిమిటేషన్ ప్రక్రియ చేపట్టారు. పెరిగిన పరిధికి అనుగుణంగా పాలనను సులభతరం చేసేందుకే తాజాగా ఈ మూడు కార్పొరేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొత్తం 60 సర్కిళ్లలో జీహెచ్ఎంసీకి 30, సైబరాబాద్‌కు 16, మల్కాజ్‌గిరికి 14 సర్కిళ్లను కేటాయించారు.ఈ విభజనతో మూడు కార్పొరేషన్లు ప్రత్యేక చట్టబద్ధ సంస్థలుగా తమ కార్యకలాపాలు నిర్వహిస్తాయి. కాగా, సైబరాబాద్ నూతన కమిషనర్‌గా జి. సృజన ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. ఈ పునర్వ్యవస్థీకరణ ద్వారా మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం కావడంతో పాటు, స్థానిక సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని అధికారులు భావిస్తున్నారు.

ప్రజా మంటలు
గురువారం 12 - 02 - 2026

# హెడ్ కానిస్టేబుల్ పూస శ్రీనివాస్‌కు రివార్డ్



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 ( ప్రజామంటలు ):** విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు సికింద్రాబాద్ చిలకలగూడ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ పూస శ్రీనివాస్ (హెచ్‌సీ-2708) కు పురస్కారం లభించింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ వీ సీ సజ్జనార్ ఆయనకు రివార్డు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా సహచరులు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లా పరిధిలో ప్రశాంతంగా కొనసాగుతున్న మున్సిపల్ ఎన్నికలు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల ఫిబ్రవరి 11 (ప్రజా మంటలు)** :జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న ఎన్నికలు ప్రశాంతంగా, కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా ఎస్పీ వివిధ ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఓటరు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు మరియు ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారుల కు మరియు సిబ్బందికి ఎస్పీ భద్రత పరమైన పలు సూచనలు చేశారు. ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ సూచనలు చేశారు.ఎస్పీ వెంట డీఎస్పీ రఘు చందర్, ఇన్స్పెక్టర్ లు కరుణాకర్, రవి, మరియు ఎస్. ఐ లు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే గుండె వాల్వ్ చికిత్స

## మెడికవర్ ఆసుపత్రిలో అరుదైన సర్జరీ

## రోగికి పునఃర్జన్మ ప్రసాదించిన వైద్యులు



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 ( ప్రజామంటలు) :**సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు అరుదైన సర్జరీ నిర్వహించి, రోగికి పునఃర్జన్మ ప్రసాదించారు. బుధవారం మెడికవర్ ఆసుపత్రి వైద్య నిపుణులు నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 72 ఏళ్ల వృద్ధురాలు మిట్రల్ వాల్వ్ లీకేజీ తో బాధపడుతోంది. శ్వాసలో ఇబ్బంది, స్వల్ప శ్రమకే ఆయాసంతో ఆసుపత్రిలో చేరిన ఆమెకు పరీక్షల్లో తీవ్రమైన వాల్వ్ లీకేజీ ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా మినిమల్ ఇన్వేసివ్ విధానంలో విజయవంతంగా చికిత్స అందించారు. వయస్సు, ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ సర్జరీ ప్రమాదకరమని భావించి మల్టీడిసిప్లినరీ హార్ట్ టీమ్ కాథెటర్ ద్వారా కాలి రక్తనాళం నుంచి చికిత్స నిర్వహించింది.డా. ప్రమోద్ కుమార్ కుచులకంటి (డైరెక్టర్ స్ట్రక్చరల్ హార్ట్ డిసీజ్ & అడ్వాన్స్ కోరనరీ ఇంటర్వెన్షన్స్) నాయకత్వంలో డా. సాగర్ చంద్రశేఖర్ భుయార్, డా. ఎన్. శివ ప్రసాద్ నాయుడు, డా. అమరేంద్ర కుమార్ సింగ్, డా. పర్వత్రాజ్ వరుణ్ గౌతమ్, డా. సుబ్రహ్మణ్యం కలిసి ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.ప్రస్తుతం రోగి ఆరోగ్యం స్థిరంగా ఉండి, శ్వాసలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోందని తెలిపారు.

# కృష్ణానగర్ 41 వ వార్డులో ఓటు హక్కు వినియోగించుకున్న డా బోగ శ్రావణి



**జగిత్యాల ఫిబ్రవరి 11 ( ప్రజా మంటలు) :**జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా భోగ శ్రావణి ప్రవీణ్ తమ ఓటు హక్కును 41వ వార్డులోని ఆల్ ఫోర్స్ స్కూల్లో వినియోగించుకున్నారు. అనంతరం పలు వార్డులలో ఎన్నికల సరళిని పరిశీలించారు.

# పలు ఎన్నికల కేంద్రాల ఎన్నికల సరళని పరిశీలించిన దావ వసంత



**జగిత్యాల ఫిబ్రవరి 11 (ప్రజా మంటలు) :**మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జగిత్యాల, రాయికల్ పట్టణం లోని బి ఆర్ ఎస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను కలిసి ఎన్నికల సరళి తెలుసుకున్న జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ . బి ఆర్ ఎస్ తో నే జగిత్యాల, రాయికల్ పట్టణ అభివృద్ధి జరిగిందిందని జగిత్యాల రాయికల్ పట్టణం లో గులాబీ జెండా ఎగరేవేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు బి.ఆర్.ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఒరిజినల్ కాంగ్రెస్ వాదులకు వలసవాదులకు మధ్య ప్రస్తుత ఎన్నికలు



**జగిత్యాల ఫిబ్రవరి 11 ( ప్రజా మంటలు) :**జిల్లా కేంద్రంలో కుటుంబ సమేతంగా ఓటింగ్ లో పాల్గొన్నారు. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి జగిత్యాల పట్టణంలో 23 వార్డులో ఎస్ కె ఎన్ ఆర్ గౌట్ జూనియర్ బాయ్స్ కాలేజీలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి కుటుంబ సమేతంగా ఓటింగ్ లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అసలైన కాంగ్రెస్ వాదులకు వలసవాదులకు మధ్య మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నాయని రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. తాను బలపరిచిన అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# హింగే భాస్కర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రెస్ క్లబ్ మిత్రులు



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 11 ప్రజా మంటలు :**తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా హన్మకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన హింగే భాస్కర్ కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎల్కతుర్తి ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగింది. ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, మండలంలో రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న రైతు సంక్షేమం సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ రైతు సమాజానికి ఎంతో మేలు రైతుల సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా మీరు సామార్థవంతంగా రైతుల వెన్నంటే ఉండి రైతులకు సామన్యాయంగా మేలు జరిగే విధంగా పోరాడి రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే విధంగా కృషి చేస్తున్న హింగే భాస్కర్ జన్మదిన శుభాకాంక్షలు మీరు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో కుటుంబ సభ్యులతో మరెన్నో ఇలాంటి పుట్టినరోజు శుభాకాంక్షలు జరుపుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ సుకినే సంతాజి, ఎల్కతుర్తి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు కందుకూరి రాజన్న, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు శ్రీరామోజు సతీష్ చారి, చిర్ర ఉదయ చందర్, ప్రెస్ క్లబ్ ప్రచార కార్యదర్శి నల్ల రాజిరెడ్డి, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు బొంకూరి వంశీ, ప్రెస్ క్లబ్ కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ కోశాధికారి కందుకూరి మహేష్ చారి, మిత్రుడు అల్లకొండ రాజు, కానిస్టేబుల్ బక్కయ్య, సీనియర్ కాంగ్రెస్ నేత బొల్లె పోగు డాక్టర్ రమేష్ బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాక రమేష్, బొంకురి కార్తీక్, ఆర్టీసీ డ్రైవర్ గుడెల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగింపు

## జిల్లా వ్యాప్తంగా 70.13% నమోదు





**జగిత్యాల, ఫిబ్రవరి 11 (ప్రజా మంటలు):**జగిత్యాల జిల్లా వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.జగిత్యాల మున్సిపాలిటీ వివరాలుమొత్తం వార్డులు: 50ఓటర్లు: 94,800అభ్యర్థులు: 254పోలింగ్ కేంద్రాలు: 149పోలింగ్ సిబ్బంది: 745పోలింగ్ శాతం: 69.60%రాయికల్ మున్సిపాలిటీ వివరాలువార్డులు: 12ఓటర్లు: 13,084అభ్యర్థులు: 100పోలింగ్ కేంద్రాలు: 24పోలింగ్ సిబ్బంది: 120పోలింగ్ శాతం: 74.96%ఇతర మున్సిపాలిటీల పోలింగ్ శాతంధర్మపురి: 75.16%కోరుట్ల: 69.47%మెట్‌పల్లి: 69.21%జిల్లా వ్యాప్తంగా మొత్తం 70.13 శాతం పోలింగ్ నమోదు అయింది.మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్. రమణ పురాణిపేట హైస్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి జగిత్యాలలో ఓటు వేశారు. రాయికల్‌లో బీఆర్ఎస్ నేతలు విజయం పై ధీమా వ్యక్తం చేశారు.

# హుస్నాబాద్ లో కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్, ఫిబ్రవరి 11,( ప్రజా మంటలు ) :**హుస్నాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో తమ కుటుంబ సభ్యులతో కలిసి నవభారత్ హైస్కూల్లో మూడో వార్డులో తమ ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూభారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థ లో ఓటు అనేది ఆయుధం..పోలింగ్ రోజు ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలిగ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం ఓటర్లు ఓటు వేస్తున్నారు116 మున్సిపాలిటీ లు ,7 కార్పొరేషన్ లలో ప్రతి అర్బన్ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్న..గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులను ఏ విధంగా ఎన్నుకుంటున్నారో అర్బన్ ప్రాంతాల అభివృద్ధికి పట్టణ ఓటర్లు తమ విచక్షణ తో ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడి ప్రజా ప్రతినిధి నీ ఎక్కుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న ,అర్బన్ లో అనేక పనులు ఉన్నప్పటికీ వెసులుబాటు చేసుకొని తమ ఓటు వినియోగించుకోవాలి అర్బన్ ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకోండి ఇది ప్రజాస్వామ్యానికి నిదర్శనం తెలిపారు.

# నేడు తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ

## బాగ్ లింగంపల్లిలో నిర్వహణ




**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రజా మంటలు):** తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ ఫిబ్రవరి 12న (గురువారం) ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న ఆర్టీసీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నారు.ఈ సమావేశానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధ్యక్షత వహించనున్నారు. వివిధ ఉద్యమ సంఘాల నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు ఈ సభలో పాల్గొననున్నారు.సభకు సంబంధించి వివరాలను తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి మీడియాకు తెలిపారు.

# హుస్నాబాద్ లో పోలింగ్ ప్రశాంతం

**హుస్నాబాద్,ఫిబ్రవరి 11(ప్రజా మంటలు) :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డుల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది పట్టణంలో 20 వార్డులో మొత్తం 19277 మంది ఓట్ల గాను 16192 (84.21) ఓట్లు పోలయ్యాయి ఇందులో పురుషులు (7916) మహిళలు (8272) ఇతరులు 4 ఓట్లు వేశారుపోలింగ్ కేంద్రాల ను ఏసీపి సదానంద్ తనిఖీ చేశారు పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లను పటిష్ఠ భద్రతతో స్ట్రాంగ్ రూం కు తరలించే విధంగా ఏర్పాటు చేశామని ఏ సి పి తెలిపారు.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు పోలింగ్ శాతం ఎంతంటే

## ప్రశాంతంగా ముగిసిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్

## రాష్ట్రవ్యాప్తంగా 73.03 శాతం పోలింగ్ నమోదు

## అత్యధికంగా చౌటుప్పల్‌లో, అత్యల్పంగా నందికొండలో ఓటింగ్

## ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు, 14న మేయర్, చైర్‌పర్సన్ల ఎన్నిక



తెలంగాణలో పురపాలక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో బుధవారం జరిగిన ఈ ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73.03 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.వివరాల్లోకి వెళితే, ఏడు కార్పొరేషన్ల పరిధిలో 66.05 శాతం పోలింగ్ నమోదు కాగా, 116 మున్సిపాలిటీల్లో 75.88 శాతం ఓటింగ్ జరిగింది. అత్యధికంగా చౌటుప్పల్ మున్సిపాలిటీలో 91.91 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. అదే సమయంలో, అత్యల్పంగా నందికొండ మున్సిపాలిటీలో 59.68 శాతం పోలింగ్ నమోదైంది.ఈ ఎన్నికల్లో 52 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 14న మేయర్, చైర్‌పర్సన్ల ఎన్నిక, ఫిబ్రవరి 16న వారి ప్రమాణ స్వీకారం ఉంటాయి.

# మున్సిపల్ పోరులో పలుచోట్ల ఉద్రిక్తతలు

## మహబూబాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల బాహాబాహీ

## నిజామాబాద్ లోని 19వ వార్డ్ లో టెన్షన్

## సదాశివపేటలో ఓటర్లకు డబ్బులు పంచిన అభ్యర్థి



తెలంగాణలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లలో 116 స్థానాలకు ఉదయం నుంచి పోలింగ్ కొనసాగుతోంది. ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కాగా.. ఓటర్లు ఉత్సాహంగా కేంద్రాలకు తరలివస్తున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఈసీ, పోలీసులు ఏర్పాట్లు చేయగా.. కొన్ని కేంద్రాల వద్ద మాత్రం ఉద్రిక్తతలు నెలకొన్నాయి. మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వివిధ పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణలు నెలకొన్నాయి. భద్రతా విధుల్లో ఉన్న పోలీసులు కల్పించుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. సదాశివపేటలో ఓటర్లకు డబ్బులు పంచుతున్న ఒక అభ్యర్థిని ఓ పార్టీ కార్యకర్తలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.నిజామాబాద్ జిల్లాలో..జిల్లా కేంద్రంలోని కోటగల్లీ 25వ డివిజన్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీజేపీ, కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా నినాదాలు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి వారిని చెదరగొట్టారు. 19వ డివిజన్ లో బీజేపీ ఎమ్మెల్యే సూర్యనారాయణ తన అనుచరులతో కలిసి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఎలా అనుమతించారంటూ పోలీసులను సూర్యనారాయణ నిలదీశారు. అదేసమయంలో కాంగ్రెస్ నేత నగేశ్ రెడ్డి అక్కడికి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. నగేశ్ రెడ్డి, సూర్యనారాయణ అనుచరుల మధ్య వాగ్వాదం నెలకొంది. పోలీసుల ఇరు పార్టీల కార్యకర్తలను అక్కడి నుంచి వెళ్లగొట్టారు.బోధన్ లో..బోధన్ పట్టణంలో ఎంఐఎం, బీఆర్ఎస్ కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేస్తూ ఉద్రిక్త వాతావరణం సృష్టించారు. నిజామాబాద్ జిల్లాలోని రాకాసిపేట్ పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు వేసేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులను పోలింగ్ సిబ్బంది అడ్డుకున్నారు. సంగారెడ్డి జిల్లాలోని 28వ వార్డు పోలింగ్ కేంద్రంలో దొంగ ఓటు వేసేందుకు ప్రయత్నించిన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.మహబూబాబాద్ పట్టణంలో..మహబూబాబాద్ పట్టణంలోని 32, 33 నెంబరు పోలింగ్ బూత్‌ల వద్ద స్వల్ప ఘర్షణలు జరిగాయి. 14వ వార్డులో పోటీలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత పెరిగింది.మెదక్ జిల్లాలో..మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలోని 15వ వార్డులోనూ స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రానికి వెళుతున్న ఓటర్లను ప్రలోభపెడుతున్నారంటూ బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు... పోలింగ్ శాతం ఎంతంటే...!

## ప్రశాంతంగా ముగిసిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్

## రాష్ట్రవ్యాప్తంగా 73.03 శాతం పోలింగ్ నమోదు

## అత్యధికంగా చౌటుప్పల్‌లో, అత్యల్పంగా నందికొండలో ఓటింగ్

## ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు, 14న మేయర్, చైర్‌పర్సన్ల ఎన్నిక



తెలంగాణలో పురపాలక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో బుధవారం జరిగిన ఈ ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73.03 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.వివరాల్లోకి వెళితే, ఏడు కార్పొరేషన్ల పరిధిలో 66.05 శాతం పోలింగ్ నమోదు కాగా, 116 మున్సిపాలిటీల్లో 75.88 శాతం ఓటింగ్ జరిగింది. అత్యధికంగా చౌటుప్పల్ మున్సిపాలిటీలో 91.91 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. అదే సమయంలో, అత్యల్పంగా నందికొండ మున్సిపాలిటీలో 59.68 శాతం పోలింగ్ నమోదైంది.ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అయితే, క్యూ లైన్లలో నిల్చున్న వారికి రాత్రి 7 గంటల వరకు ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,203 పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కొన్ని చోట్ల స్వల్ప ఘర్షణలు మినహా, పోలింగ్ ప్రక్రియ మొత్తం ప్రశాంత వాతావరణంలో సాగింది. వృద్ధులు, వికలాంగులకు పోలీసులు సహాయం అందించి ఓటు వేయించారు. పోలీసు సిబ్బంది అంకితభావంతో పనిచేశారని డీజీపీ శివధర్ రెడ్డి ప్రశంసించారు.ఈ ఎన్నికల్లో 52 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 14న మేయర్, చైర్‌పర్సన్ల ఎన్నిక, ఫిబ్రవరి 16న వారి ప్రమాణ స్వీకారం ఉంటాయి.

# మీ బండి నెంబర్ ప్లేట్ అంకెలు కనిపించకుండా చేస్తున్నారా

**ఇక నుంచి తప్పదు భారీ మూల్యం**

**బండి నెంబర్ కనిపించకుండా వాహనదారుల కొత్త కొత్త జిమ్మిక్కులు**

**ట్యాంపరింగ్ చేసేవారిపై పోలీసుల నిఘా**

**క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరికలు**




నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి, చలాన్ల నుంచి తప్పించుకోవడానికి నంబరు ప్లేటును మార్చేస్తున్న వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు నిఘా పెట్టారు. అంకెలు మార్చడం, నంబరు ప్లేటుపై అంకెలు కనిపించకుండా రంగు పూయడం, దానిపై మాస్కులు తగిలించడం వంటి చర్యలకు పాల్పడితే భారీ జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

**ఇటీవల జరిగిన ఘటనలు :**

తాజాగా బంజారాహిల్స్‌లో పోలీసులు తనిఖీ చేస్తుండగా నంబరు ప్లేటు లేకుండా వస్తున్న వాహనదారుడిని గమనించారు. వాహనం తనిఖీ చేయగా ప్లేటును డిక్కీలో దాచినట్లు గుర్తించారు. దానిపై ఇప్పటికే 22 చలాన్లు ఉన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మలక్‌పేటలో ఓ ఘటన వెలుగులోకి వచ్చింది. ఒక వ్యక్తి తన ద్విచక్రవాహనం నంబర్ ప్లేటులోని 9 అంకెను కాస్త 8గా మార్చి ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించాడు. ఈయన చేసిన పనికి వేరే వ్యక్తి వాహనంపై 23 చలాన్లు పడ్డాయి. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీటీవీ కెమెరాల ఆధారంగా నిందితుడిని పట్టుకుని అతడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. పెద్ద ప్లాన్ ప్రకారం స్టిక్కర్ల సాయంతో 1ని 7గా, 0ని 8గా, 3ని 9గా అంకెలను మార్చేస్తున్నారు. సీసీటీవీ, ట్రాఫిక్ పోలీసుల కెమెరాలతో దొరక్కుండా, నంబరు ప్లేటు కనిపించకుండా వెనక్కి, కిందికి వంచుతున్నారు. అక్కడ ఉద్దేశపూర్వకంగా మాస్కులు తగిలిస్తున్నారు. అంతేకాకుండా ఆ అంకెలు అస్పష్టంగా కనిపించేలా గ్రీజు, బురద పూస్తున్నారు. ఇది తీవ్రమైన నేరం : నగరవ్యాప్తంగా అక్రమంగా నంబర్ ప్లేట్లు, రిజిస్ట్రేషన్ లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేస్తున్నారు. నంబరు ప్లేట్లను మార్చడం కేవలం చలాన్ల నుంచి తప్పించుకోవడమే కాకుండా దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌కు దారితేసే ప్రమాదం ఉంది. వాహన నంబరు ప్లేటు ట్యాంపరింగ్ చేస్తే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 318(4), 319(2) కింది మోసం, ఫోర్జరీ కేసులు నమోదు చేస్తారు. అలాగే మోటారు వాహనాల చట్టం ప్రకారం రూ.1,000 నుంచి రూ.5000 వరకు జరిమానా విధిస్తారు. వాహనంపై తప్పుడు చలాన్లు వస్తున్నట్లు ఒకవేళ గమనిస్తే, వెంటనే ట్రాఫిక్ పోలీసు వెబ్‌సైట్, 87126 61690 వాట్సాప్ నంబర్‌లలో ఫిర్యాదు చేయవచ్చు.

**నెంబర్ ప్లేట్ కనిపించకుండా కొత్త ప్లాన్‌లు :** అసలు రూల్స్ పాటించరు కానీ ఇలా సరికొత్త ప్లాన్‌లతో ట్రాఫిక్ పోలీసులను బురిడీ కొట్టిస్తున్నారు. ఇలాంటి పనులు చేసే వారిలో కాలేజ్ విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారు. వాహన నెంబర్ ప్లేట్ కనిపించకూడదని కాలు అడ్డం పెడుతుంటారు. చేతులతో కవర్ చేస్తుంటారు. అదే అమ్మాయిలు, మహిళలు ఉంటే వారి చీర, చున్నీలతో నెంబర్ ప్లేట్‌ని దాచేస్తుంటారు. అది కనిపించకుండా ఉండటానికి పేపర్ అంటించడం లేదా మట్టి రాస్తున్నారు. దీంతో ఎలా వెళ్లినా చలాన్ పడదని అనుకుంటారు. ఇలా చేసినప్పుడు కొన్నిసార్లు బండి బ్యాలెన్స్ తప్పి ప్రమాదాలు సంభవించవచ్చు.మరికొన్నిసార్లు 6 అంకెను ఆరులో సగం కనిపించేలా, మిగతా దాన్ని పేపర్‌తో కవర్ చేస్తారు. ఇలా చేసినప్పుడు పోలీసులు ఫొటో తీసి సర్చ్ చేస్తే ఆ వాహనం ఎవరిది అనే విషయం తెలియదు. అలాగే అందులో నెంబర్ కూడా తప్పుగా చూపిస్తుంది. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోకపోవడం వల్ల ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పటికి మించిపోయింది ఏమీ లేదు. నిబంధనలు అతిక్రమించి, ప్రయాం చేసే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

# వేసవిలో ప్రతి జిల్లాలో డ్రోన్ల శిక్షణా కేంద్రాలు ఏర్పాటు

**మంత్రి జనార్ధన్‌రెడ్డి**

**సచివాలయంలో ఫైబర్ నెట్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్‌పై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమీక్ష**

**ఫైబర్‌నెట్ ద్వారా మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని అధికారులకు సూచన**

ఈ వేసవిలో ప్రతి జిల్లా కేంద్రంలో డ్రోన్‌ల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు పైలెట్ సన్నద్ధం అయ్యేలా ప్రణాళికలు రచించాలని మంత్రి ఆదేశించారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్‌పై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సచివాలయంలో సమీక్షించారు. సమావేశంలో ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ శౌర్య మాన్ పటేల్, ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ అడిషనల్ సీఈవో పి.ప్రవీణ్ కుమార్, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. డ్రోన్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధిపై ఆరా తీసిన మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. డ్రోన్ సిటీ ఏర్పాటు, టెస్టింగ్‌కు ప్రత్యేక ఎయిర్ స్పేస్ కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ డీజీసీఏ అనుమతిపై చర్చించారు.ఇప్పటికీ డ్రోన్ కార్పొరేషన్ ఏపీ ఫైబర్ నెట్‌లో భాగంగా ఉన్నందున స్వయం ప్రతిపత్తి కల్పించాలనే అంశంపై చర్చించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయం అనుబంధ రంగాల్లో డ్రోన్ల వినియోగం, ప్రజల్లో అవగాహన పెంచాలని నిర్దేశించారు. భవిష్యత్తులో పైలెట్ శిక్షణకు ఉన్న డిమాండ్, అవశ్యకత ఆధారంగా వృత్తి నైపుణ్య కోర్సులు రూపొందించే అంశాలను పరిశీలించాలని అన్నారు. సీఎం ఆలోచనల మేరకు డ్వాక్రా సంఘాల మహిళలకు డ్రోన్ పైలెట్లుగా శిక్షణ అందించే అంశాన్ని పరిశీలించాలని, ఏపీని డ్రోన్ కేపిటల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దాలన్న సీఎం ఆశయం మేరకు పనిచేయాలని సూచించారు.ఫైబర్ నెట్ కనెక్షన్లు పెంచేందుకు చర్యలు: ఏపీ ఫైబర్ నెట్ ద్వారా ప్రజలకు మెరుగైన, విస్తృతమైన సేవలు అందించేందుకు




కృషి చేయాలని పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో అధునాతన టెక్నాలజీలను అందిపుచ్చుకుని ప్రజలకు నాణ్యమైన సేవలు కల్పించాలని మంత్రి ఆదేశించారు. ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్‌పై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమీక్షించారు. సమావేశంలో ఏపీ ఫైబర్ నెట్ ఎండీ గీతాంజలి శర్మ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు మానస పుత్రిక అయిన ఫైబర్ నెట్ వ్యవస్థను గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్న మంత్రి పూర్వవైభవం తీసుకురావాలని నిర్దేశించారు. ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్లు మరింత పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. అమెండడ్ భారత్ నెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా తీసుకుంటున్న చర్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. సీఎం సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో సీసీ టీవీలు పెట్టాలనే ప్రతిపాదన ఉందని అధికారులు వివరించారు.

# ఏపీలో ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్

**అర్హులైన 7,514 మందికి త్వరితగతిన పదోన్నతులు కల్పించాలన్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి**

**7,673 ఖాళీల భర్తీకి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశం**

**స్మార్ట్ కార్డుల టెండర్ నిబంధనలు త్వరగా ఖరారు చేయాలని మంత్రి ఆదేశాలు**



ఆర్టీసీ ఉద్యోగులకు ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, అర్హులైన 7,514 మందికి త్వరితగతిన పదోన్నతులు కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సచివాలయంలో నిన్న రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతో కలిసి ఆర్టీసీ, రవాణా శాఖలపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు మంత్రికి వివరాలు వెల్లడించారు. 2025-26 డీపీసీ కింద అర్హులైన ఉద్యోగుల ఎంప్యానల్‌ను ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీలో 44,131 మంది ఉద్యోగులే ఉన్నారని, వచ్చే మూడేళ్లలో 6,891 మంది పదవీ విరమణ చేయనున్నట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో 7,673 ఖాళీల భర్తీకి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అలాగే మెడికల్ అన్‌ఫిట్ అయిన 682 మంది ఉద్యోగుల్లో 36 మందికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు, మరో 646 మందికి ఆర్థిక పరిహారం చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఏపీలో తిరిగే బస్సులకు సంబంధించిన అఖిలభారత టూరిస్ట్ పర్మిట్ పన్నులపై ట్రావెల్స్ బస్సుల సంఘాలతో సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుందామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పన్ను తగ్గిస్తే ఆయా బస్సులు ఏపీలోనే రిజిస్ట్రేషన్ అవుతాయని రవాణా అధికారులు మంత్రికి వివరించారు. డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల కోసం జారీ చేసే స్మార్ట్ కార్డుల టెండర్ నిబంధనలు త్వరగా ఖరారు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలకు వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైజ్ (వీఎల్‌టీ) ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉన్నందున, అందుకు సంబంధించిన ఆర్ఎఫ్‌పీ (ఆర్ఎఫ్‌పీ)ను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రవాణా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా, ఆర్టీసీ ఈడీలు బ్రహ్మానందరెడ్డి, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పలువురు సీనియర్ ఐఏఎస్‌ల బదిలీలు

**సింగరేణి సీఎండీగా డా. జ్యోతి బుద్ధప్రకాశ్ నియామకం**

**ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా కాత్యాయనీ దేవి నియామకం**

**దివ్య దేవరాజన్‌కు పంచాయతీరాజ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు**

తెలంగాణ ప్రభుత్వం పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. తాజాగా విడుదలైన అధికారిక ఉత్తర్వుల ప్రకారం పలు ప్రధాన శాఖల్లో ఉన్నతాధికారుల మార్పులు చేపట్టింది. ఈ బదిలీలు రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులకు దారి తీసే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. బదిలీ అయిన అధికారుల వివరాలు.. సింగరేణి సీఎండీగా డా. జ్యోతి బుద్ధప్రకాశ్, ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్‌ను నియమించారు. గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ కొనసాగనున్నారు. టీజీఆర్ఏసీ డీజీగా సందీప్ కుమార్ సుల్తానియాను నియమించగా, పంచాయతీరాజ్ కమిషనర్‌గా దివ్య దేవరాజన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా కాత్యాయనీ దేవి నియమితులయ్యారు. స్టేట్




ఫైనాన్స్ కార్పొరేషన్ జేఎండీగా కాత్యాయనీ దేవికి అదనపు బాధ్యతలు కేటాయించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జాయింట్ ఎండీగా మయాంక్ మిట్టల్‌ను నియమించారు. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ స్పెషల్ సీఎస్‌గా రఘురాం శర్మకు బాధ్యతలు అప్పగించారు. అలాగే, మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్డీగా అదనపు బాధ్యతల్లో రఘురాం శర్మ కొనసాగనున్నారు.

# ఏపీ జేఏసీ చైర్మన్‌గా విద్యాసాగర్ ఏకగ్రీవంగా ఎన్నిక

**అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా ప్రభుత్వం పీఆర్సీ చైర్మన్‌ను నియమించాలన్న విద్యాసాగర్**

**33 ఏళ్ల సర్వీస్ నిబంధనపై ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడి**

**ఈ అంశంపై అవగాహన లేని కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్న విద్యాసాగర్**





ఏపీ జేఏసీ చైర్మన్‌గా ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఎన్జీవో హోంలో నిన్న నిర్వహించిన జేఏసీ సమావేశంలో ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు విద్యాసాగర్‌ను దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా పీఆర్సీ చైర్మన్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, 33 ఏళ్ల సర్వీస్ నిబంధనపై ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై అవగాహన లేని కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రసాద్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ డీవీ రమణతో పాటు నేతలు ఎం. రఘునాథరెడ్డి, జి. హృదయరాజు, బి. సాంబశివరావు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో పవన్ కల్యాణ్ ఛాంబర్ కు వెళ్లి కలిసిన నారా లోకేశ్

**ప్రారంభమైన ఏపీ అసెంబ్లీ సమావేశాలు**

**గవర్నర్ ప్రసంగం అనంతరం అసెంబ్లీ రేపటికి వాయిదా**

**తాజా రాజకీయ పరిణామాలపై చర్చించిన పవన్, లోకేశ్**



ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. అనంతరం సభ రేపటికి వాయిదా పడింది. బీఏసీ సమావేశంలో అసెంబ్లీ సమావేశాల అజెండాను ఖరారు చేయనున్నారు. దీని తర్వాత ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశం జరగనుంది.మరోవైపు, అసెంబ్లీలోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఛాంబర్ కు మంత్రి నారా లోకేశ్ వెళ్లారు. తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. బడ్జెట్ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై వీరు చర్చించారు.


# 'ఇదీ పుస్తకం ప్రస్తుత పరిస్థితి'

**రాహుల్ గాంధీ పుస్తక ప్రదర్శనపై స్పందించిన నరవణె**

**'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం ఇంకా ప్రచురణ కాలేదని పెంగ్విన్ పోస్టు**

**దీనిని రీపోస్టు చేస్తూ 'నా పుస్తకం ప్రస్తుత పరిస్థితి ఇదీ' అన్న నరవణె**

**రాహుల్ గాంధీ ట్వీట్‌పై స్పందించిన పెంగ్విన్ సంస్థ**




తన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం ప్రచురణపై భారత సైన్యం మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె మౌనం వీడారు. తన పుస్తకం ఇంకా ప్రచురణ కాలేదని ఆయన పరోక్షంగా స్పష్టం చేశారు. నా పుస్తక ప్రచురణ ప్రస్తుతం ఈ పరిస్థితిలో ఉందంటూ ఆయన 'ఎక్స్' వేదికగా 'పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా' చేసిన పోస్టును పేర్కొన్నారు.ఈ పుస్తకం కాపీలు ఇంకా ప్రింట్ కాలేదని, డిజిటల్ రూపంలో కూడా పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదని, కాబట్టి ఈ కాపీలు ఎవరికీ ఇవ్వలేదని, విక్రయించలేదని ప్రముఖ పబ్లిషింగ్ సంస్థ పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా పోస్టు చేసింది. దీనిని ఆయన రీపోస్టు చేస్తూ పైవిధంగా స్పందించారు. ఈ పుస్తకం ఇంకా ప్రజలకు అందుబాటులోకి రాలేదని పెంగ్విన్ ప్రకటన చేసింది.నరవణే రాసిన పుస్తకంపై పార్లమెంటులో దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. చైనా భారత భూభాగంలోకి వచ్చిందని ఈ పుస్తకం వెల్లడిస్తోందని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే ఆ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని అధికార బీజేపీ చెబుతోంది. ఇటీవల ఆయన ఈ పుస్తకంలోని కొన్ని పేజీలను కూడా సభలో ప్రదర్శించారు. ఈ క్రమంలో పెంగ్విన్ సంస్థ, నరవణే స్పందించారు. ఈ పుస్తకం ప్రచురణ కాలేదని స్పష్టం చేశారు.

# అదానీ పరువునష్టం కేసులో జర్నలిస్టుకు జైలు




అదానీ గ్రూప్ పై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలు, ట్వీట్లు చేసినందుకు ఓ జర్నలిస్టును కోర్టు జైలుశిక్ష విధించింది. ప్రజలు, పెట్టుబడిదారుల్లో తమ విశ్వసనీయతను దెబ్బతీసేలా కథనాలు రాశారంటూ జర్నలిస్ట్ రవి నాయర్ పై అదానీ గ్రూప్ క్రిమినల్ డిఫమేషన్ కేసు దాఖలు చేసింది. ఈ కేసు విచారించిన మాన్సా మేజిస్ట్రేట్.. రవి నాయర్ చేసిన ట్వీట్లు కేవలం విమర్శలు కావని, అవి కంపెనీ విశ్వసనీయతను దెబ్బతీసేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ తన వాదనలను పక్కా ఆధారాలతో నిరూపించగలిగిందని కోర్టు స్పష్టం చేసింది. రవి నాయర్ ను దోషిగా తేలుస్తూ, ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

**కేసు ఏమిటంటే..**

అదానీ గ్రూప్ ఫ్లాగ్‌షిప్ కంపెనీ అయిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) పై రవి నాయర్ గతంలో పలు ట్వీట్లు చేశారు. ఓ కథనం కూడా రాశారు. రవి నాయర్ తమ సంస్థపై తప్పుడు ప్రచారం చేశారని ఏఈఎల్ ఆరోపించింది. ఆయన ఉద్దేశపూర్వకంగా ట్వీట్లు చేసి తమ కంపెనీ ప్రతిష్టకు భంగం కలిగించారని, పెట్టుబడిదారులలో అయోమయం సృష్టించారని అదానీ గ్రూప్ పరువు నష్టం కేసు దాఖలు చేసింది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com